గిలిగింతలు పెట్టే కథ


టి.వి.ఎస్.రామానుజరావు

# డామిట్! గడ్డం కథ అడ్డం తిరిగింది

"ఏమిత్రా! ఎంతోకాలంగా ట్రిమ్ చేస్తూ వచ్చిన గడ్డాన్ని తీసేస్తావా?" అడిగాడు సౌమిత్రి.

అన్నయ్య చూడకుండా అతని గదిలోని ఎలక్ట్రికల్ రేజర్ తీసుకుపోబోతున్న శశాంక గతుక్కుమన్నాడు. "మరే...మరే" అన్నాడు నీళ్ళు నములుతూ.

"ఏమిటో ఆ మరేలు...?" అన్నాడు సౌమిత్రి.



"పద్మజ గడ్డం పూర్తిగా తీసెయ్యాలంది" చెప్పలేక చెప్పాడు.

"ఆ అమ్మాయి అంటే మాత్రం, తీసెయ్యడమేనా! నిజానికి నీకు గడ్డం ఎంతో బాగుంది" అన్నాడు సౌమిత్రి.

"ఏమో తనకి అసలు బాగా లేదంది" నసిగాడు శశాంక.

"తియ్యనని చెప్పాలోయ్! నిన్నగాక మొన్న పెళ్ళయిందో లేదో! అప్పుడే ఇంత కంట్రోల్లో పెట్టేస్తే, రేపు నీ మాట అసలు వినదుగాక వినదు" అన్నాడు సౌమిత్రి గంభీరంగా.

శశాంక ఇరకాటంలో పడ్డాడు. గడ్డం తీసెయ్యకపోతే, శోభనం రోజు దగ్గరకు రానీయనని పద్మజ వార్నింగ్ ఇచ్చేసింది. గడ్డం తీసేద్దామని తయారైతే అన్నయ్య పట్టేసుకున్నాడు. గడ్డం తీసెయ్యడమంటే ఇండివిడ్యువాలిటీ చంపుకోవడమేనని తన ఫ్రెండు ప్రసాదు కూడా హెచ్చరించాడు. గడ్డం తీసేస్తే రేపు నలుగురు తనను పెళ్ళాంమాట వినే చవట కింద కట్టేస్తారేమో! శశాంక ఆలోచనల్లో పడ్డాడు. చివరికి గడ్డం తీసెయ్యకూడదని నిర్ణయించుకున్నాడు.

సౌమిత్రి తమ్ముడి గుంజాటన చూసి నవ్వుకున్నాడు.

అసలు శశాంక, పద్మజల పెళ్ళి అనుకోని విధంగా కుదిరింది.

ఒకరోజు హైటెక్ సిటీ బస్టాపులో దిగి ఆఫీసుకెడుతున్న శశాంక తనతోపాటు సన్నగా, నాజూకుగా వున్న పద్మజ అదే బస్సులోంచి దిగడం చూసి ఆశ్చర్యపోయాడు. అలా రెండు, మూడురోజులు ఆమెను గమనించి ఆమె కొత్తగా సాఫ్టువేర్ కంపెనీలో చేరిందని, ఆమె ఇల్లు కూడా తమ ఇంటికి దగ్గరేనని తెల్సుకున్నాడు.

ఒకరోజు వదిన రాధ దగ్గర తన బాధంతా వెళ్ళబోసుకున్నాడు శశాంక. ఆమెపట్ల తనకి ఏర్పడిన ఇష్టం గురించి చిన్నగా నసుగుతూ చెప్పాడు వదినకు. శశాంక చిన్నప్పుడే తల్లీతండ్రీ పోవడంతో అతడు అన్నావదినల దగ్గరే పెరిగాడు. వదిన రాధంటే తల్లికంటే ఎక్కువ అతనికి. అందుకే ఆమె దగ్గర చనువు ఎక్కువ. శశాంక సిగ్గుపడుతూ పద్మజను గురించి చెప్పినప్పుడు రాధ నవ్వాపుకుని శ్రద్ధగా విన్నది. ఆ తర్వాత అతని ప్రేమవ్యవహారం రాత్రి భర్తతో చెప్పింది.

సౌమిత్రి ముందు ఆశ్చర్యపోయాడు. వీడికి ప్రేమించేంత ధైర్యం ఎక్కడిదాని. ఆ తర్వాత భార్యనడిగి పద్మజ వివరాలన్నీ తెలుసుకున్నాడు. తల్లిదండ్రులకు ఆమె ఒక్కతే కూతురనీ, ఒక సాఫ్టువేర్ కంపెనీలో పనిచేస్తోందనీ, తగిన వరునికోసం సంబంధాలు చూస్తున్నారనీ తెలుసుకున్నాడు. రెండు వీధుల అవతలే పద్మజా వాళ్ళిల్లు. సౌమిత్రి తన భార్యతో కలిసి ఒకరోజు వాళ్ళింటికి వెళ్ళాడు. తమను తాము పరిచయం చేసుకున్నారు పద్మజ తల్లిదండ్రులకు. తాము వచ్చిన పని వివరించారు. సౌమిత్రి తన తమ్ముడి చదువు, ఉద్యోగం, వయసు



## అందం చూడవయా!

కళ్లను ఆకట్టిపడేసే అందం ప్రియమణిది. నటనలో కూడా మంచి మార్కులే కొట్టేసి, కొన్ని హిట్లు అందిపుచ్చుకున్న ప్రియమణికి ఆఫర్లు బాగానే ఉన్నాయి. 'పెళ్లైన కొత్తలో' చిత్రంలో లవ్లీగా కనిపించే ఆమె ఎక్స్‌పోజింగ్ కూడా బాగానే చేసింది. చాన్నాళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఎక్స్‌పోజింగ్‌కి సై అంటూ నితిన్ హీరోగా నటిస్తున్న 'ద్రోణ' చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోడానికి అందాలు ఆరేస్తోందని చిత్రసీమ కోడై కూస్తోంది!

వివరాలు తెలిపితే- పద్మజ తండ్రి పద్మజ వయసు, ఉద్యోగం, చదువు వగైరాలు తెలిపారు. అన్నివివరాలు ఒకరికొకరు మాట్లాడుకున్నాక, పద్మజ అభిప్రాయం కూడా తెల్సుకున్నాక మిగిలిన విషయాలు మళ్ళీ చర్చించుకుందామని ఇరువురూ అభిప్రాయపడ్డారు.

ఆ మర్నాడే పద్మజ తల్లిదండ్రులు ఈ సంబంధం చేసుకోవడం పద్మజకు ఇష్టం లేదని కబురుచేశారు. సౌమిత్రి ఆ మాట విని ఆశ్చర్యపోయాడు. ఆడపెళ్ళి వాళ్ళు వచ్చి మగపెళ్ళివాళ్ళని పెళ్ళిచూపులకు పిలవడం, వాళ్ళు అమ్మాయిని చూశాక తమ అభిప్రాయం తెల్పడం సర్వసాధారణంగా జరిగే విషయం. అలాంటిది, తమంత తామే వచ్చి అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడాక, చివరికి ఆ అమ్మాయి ఈ సంబంధం తనకొద్దన్నది. కోరి వచ్చిన సంబంధాన్ని తిరస్కరించిన ఆ అమ్మాయి చాలా దురదృష్టవంతురాలు. ఇక దాన్ని గురించి ఆలోచించడం అనవసరం అనుకున్నాడు సౌమిత్రి.

అయితే శశాంక మాత్రం పద్మజ నిర్ణయం విని హతాశుడయ్యాడు. ఆమె నుంచి ఇలాంటి సమాధానం వస్తుందని అతడనుకోలేదు. తనలో ఏ లోపం వున్నదాని అనేకసార్లు అద్దంలో పరీక్షించుకున్నాడు. తెల్సినవాళ్ళంతా, 'నీకేం రా, బాగానే వుంటావు' అంటారేకానీ ఏనాడూ ఒక్కరు కూడా 'నువ్వు బాగుండ'వన్నది లేదు. అలాంటిది, ఈ అమ్మాయి తన్ను కాదన్నదేమిటని తెగ మధనపడిపోయాడు శశాంక.

వారం రోజులుగా అన్యమనస్కంగా వున్న శశాంకను చూసి రాధ జాలిపడింది. పద్మజ కాదన్న కారణంగా బాధపడుతున్న మరిదిని ఎన్నిసార్లు ఓదార్చబోయినా, శశాంక తప్పించుకుని తిరుగుతున్నాడు.

ఆ రోజు ఆదివారం భోజనాలయినాక, ఇప్పుడే వస్తానని భర్తతో చెప్పి, బాబును తీసుకుని పద్మజావాళ్ళింటికి వెళ్ళింది. మీ సంబంధం ఇష్టం లేదని చెప్పినా కూడా, ఇంకా ఎందుకు వచ్చిందాని పద్మజ తల్లిదండ్రులు ముందు ఆశ్చర్యపోయారు. తేరుకుని ఆమెను ఆహ్వానించారు. పద్మజ తల్లి కొద్దిగా ఇబ్బంది పడుతూనే "మా అమ్మాయి తనకు ఇష్టం లేదని చెప్పిందండి" అన్నది.

రాధ చిర్నవ్వుతో "దాందేముందిలెండి! అది అమ్మాయి ఇష్టం! అయితే, నేనొకసారి పద్మజతో మాట్లాడవచ్చా?" అడిగింది.

పద్మజ తల్లి లోపల గదిలో ఏదో రాసుకుంటున్న పద్మజను పిలిచింది. విసుక్కుంటూనే హాల్లోకి వచ్చిన పద్మజ, రాధను చూసి గతుక్కుమంది.

రాధ చాలా ప్రశాంతంగా అడిగింది "నేను మీతో పది నిముషాలు విడిగా మాట్లాడొచ్చా?"

ఏదో అనబోయి పద్మజ, రాధ మొహం చూసి ఏమీ అనలేక 'సరేనని' తల ఊపింది. ఆమెను తన గదిలోకి తీసుకెళ్ళింది.

"కూర్చోండి" అంది కుర్చీ ముందుకి లాగి.

రాధ, పద్మజ ఇబ్బంది చూసి స్నేహంగా నవ్వింది. ఈవిడకు నవ్వడం తప్ప మరేం పనిలేదేమో అనుకుంది పద్మజ. విషయంలోకి సూటిగా వచ్చేసింది రాధ.

"మరేం లేదు. మీరు మా మరిదిని చూసే వుంటారు. రోజూ మీరు వెళ్ళే బస్సులోనే హైటెక్ సిటీకి వెళ్తుంటాడు. అతను కూడా సాఫ్టువేర్ ఇంజనీరే! మంచి జీతమే వస్తుంది. నా భర్తా, అతను అన్నదమ్ములు. చిన్నప్పుడే అమ్మానాన్నా చనిపోవడంతో మాదగ్గరే పెరిగాడు. చెడు అలవాట్లేమీ లేవు. ఆఫీసు, ఇల్లు తప్ప మరో వ్యాపకం లేదు. ఇన్నాళ్ళు పెళ్ళి చేసుకోమని మేమెంత పోరినా, ఇప్పుడేం తొందర పొమ్మని వాయిదాలు వేస్తూ వచ్చాడు. అలాంటిది మిమ్మల్ని చూసి చేసుకోవాలని మాతో చెప్పేసరికి మాకు ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగాయి. మీరు మా మరిది నచ్చలేదని అన్నార్ట! అతని వల్ల ఏదైనా పొరపాటుగాని జరిగిందా! ఎప్పుడైనా మిమ్మల్ని ఇబ్బందిపెట్టడం గానీ, బాధపెట్టడం గానీ చేశాడా? క్షమించండి. నేను మిమ్మల్ని ఎందుకు వద్దంటున్నారని నిలదీయడానికి రాలేదు. ఇదివరకు ఎంతో హుషారుగా ఉండేవాడు. ఈవారం రోజుల నుండి చాలా డల్‌గా వుంటున్నాడు. మా వైపు నుండి ఏదైనా పొరపాటు వుంటే సరిద్దుకోవచ్చని ఆశతో అడుగుతున్నాను" నిదానంగా రాధ చెప్పిన మాటలు వింది పద్మజ.

ఒక్క క్షణం ఏం జవాబు చెప్పాలో తోచలేదు పద్మజకు.

"మీ వల్లగానీ, మీ మరిది వల్లగానీ ఏదో పొరపాటు జరిగిందని కాదు నేను వద్దన్నది" అంది పద్మజ తల వంచుకుని.

"మరో కారణమేదైనానా?" అడిగింది రాధ.

కారణం చెప్పందే వదిలేటట్టు లేదావిడ అనుకుంటూ "పెద్దగా కారణాలేవీ లేవు" అంటూ నసిగింది పద్మజ.

రాధ నవ్వింది. "చిన్న కారణమైనా మీకు చెప్పడం ఇష్టంలేకపోతే వద్దులెండి" అంది లేస్తూ.

రాధ వెళ్ళిపోగానే పద్మజ ఆవిడ గురించే ఆలోచిస్తూ కూర్చుంది. ఆవిడకు మరిదిపై గల ప్రేమ, అతని పెళ్ళికోసం ఆమె పడే ఆరాటం పద్మజకు ఆశ్చర్యం కలిగించాయి. తను కాదన్న కారణం తెల్సుకోవాలని వచ్చి కూడా తన్ను ఇబ్బంది పెట్టకూడదన్న ఆమె సంస్కారానికి మనస్సులోనే మెచ్చుకుంది.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు బస్ ఎక్కి, మొదటిసారి శశాంక కోసం బస్సులో వెతికింది పద్మజ. శశాంక బస్సు చివరలో నిల్చొని వున్నాడు. పెరిగిన గడ్డంతో డల్‌గా వున్న శశాంకను చూడగానే, ఏదో తెలీని సాఫ్ట్ కార్నర్ ఆమెలో ఏర్పడింది. శశాంక ఆమెను చూడలేదు. ఆరోజు తను చెయ్యాల్సిన పని గురించే ఆలోచిస్తున్నాడు. బస్టాపు వచ్చేసరికి గబగబా దిగి వేగంగా నడుస్తున్న అతన్ని అందుకోలేక "శశాంక గారూ" అంటూ పిలిచింది. శశాంక వెనక్కి తిరిగి ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు.

"చూడండి! నేను ఈ సంబంధం వద్దని మా వాళ్ళతో కబురుచేశాక కూడా, మీరు మీ వదినను రాయబారం పంపడం దేనికి?" మెత్తగా వున్నా పద్మజ మాటలు కొద్దిగా కఠినంగా అనిపించాయి శశాంకకు.

ఒక్కక్షణం బిత్తరపోయాడు ఆమె ప్రశ్నకు. తేరుకుని, ఆమెతో అన్నాడు. "చూడండి పద్మజగారూ! మా వదిన మీ యింటికి వచ్చినట్లు నాకసలు తెలియదు. మీరు వద్దన్నాక దాన్ని గురించి నేను ఆలోచించనే లేదు. మా వదిన మిమ్మల్ని ఏదైనా ఇబ్బంది పెట్టివుంటే, ఆమె తరపున నేను క్షమాపణ చెబుతున్నాను" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

పద్మజ అతను వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయింది.

ఆ మర్నాడే పద్మజ తన తల్లితో చెప్పింది. శశాంక గడ్డం తీసేస్తే... అతన్ని చేసుకుంటానికి అభ్యంతరం లేదని. పద్మజ తల్లి సావిత్రి వాళ్ళింటికి వచ్చి ఆ విషయం చెప్పగానే రాధ నవ్వింది.

"గడ్డమేనా అడ్డం వాళ్ళ పెళ్ళికి?" అని అడిగింది.

పద్మజ తల్లి కూడా నవ్వి "అవును అదే" అంది.

అమితాబ్ స్టైల్‌లో ట్రిమ్ చేసుకున్న తన గడ్డం అంటే శశాంకకు ఇష్టం. ఇప్పుడు గడ్డం తీసేస్తే పద్మజ చేసుకుంటానని చెప్పిందని శశాంకకు ఎలా చెప్పాలాని రాధ ఆలోచించింది. చివరికి పెళ్ళయ్యేదాకా చెప్పకుండా వుండాలని నిర్ణయించుకుంది. మర్నాడే పద్మజను కలుసుకుని గడ్డం విషయంలో శశాంకను పెళ్ళయినాక నిదానంగా ఒప్పించవచ్చుని నచ్చచెప్పింది. పద్మజ మొదట అయిష్టంగా మొహం పెట్టినా, అటు తల్లి కూడా నచ్చచెప్పడంతో సరేనంది. పర్యవసానమే వాళ్ళిద్దరి పెళ్ళి!



ఆ రోజు రాత్రి పాలగ్లాసుతో గదిలోకి అడుగుపెట్టిన పద్మజకు శశాంక గడ్డం తీసెయ్యకపోవడం చిరాకనిపించింది.

"గడ్డం తీసెయ్యలేదా? అయితే ఇవాళ మన పడకలు వేరే" అంది.

"నో, నేనెంత ఇష్టంగా చూసుకుంటున్నానో ఈ గడ్డాన్ని. దాన్ని ఎందుకు తీసెయ్యాలి" బింకంగా అడిగాడు శశాంక.

"ఓ కే!" అంటూ పద్మజ దిండూ దుప్పటి తీసుకుని, చాప పరుచుకుని నేలమీద పడుకుంది.

రాత్రంతా నిద్రపట్టక అటూ యిటూ దొర్లుతూ గడిపాడు శశాంక. అతనికి ఆమె మీద విపరీతమైన కోపం వచ్చింది. 'అసలింత పట్టుదల ఎందుకో ఈమెకు. కోరి చేసుకుని లోకువైపోయినట్లున్నాను. నా గడ్డం మీద తనకేం హక్కుంది' కోపంగా అనుకున్నాడు వందోసారి.

అసలు తను గడ్డం పెంచకుండా వుంటే ఈ న్యూసెన్సు వుండేది కాదేమో! హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చెయ్యకుండా మధ్యలో ఈ గడ్డం అడ్డంగా వుంది.

మరి రెండ్రోజులు శశాంక గడ్డం తీసెయ్యడానికి బింకం అడ్డొచ్చీ, అతనొక్కమాటంటే వొద్దందాములెమ్మని పద్మజా, ఇద్దరూ మౌనంగా పడకలు వేరుగానే గడిపేశారు. శశాంక అన్నావదినలు గుచ్చి గుచ్చి చూస్తున్న చూపులు, స్నేహితుల జోకులను భరించలేకపోతున్నాడు. పగలల్లా మామూలుగా వుంటున్న పద్మజ రాత్రిళ్ళు మాత్రం దుప్పటి దిండూ తీసుకుని దూరంగా వుంటోంది.

నాలుగోరోజు పాలగ్లాసుతో గదిలోకి అడుగుపెట్టిన పద్మజకు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవైనాయి. నున్నగా గీసిన గడ్డంతో శశాంక కొత్తగా కనిపిస్తున్నాడు.

"ఇదేమిటీ?" అడిగింది ఆశ్చర్యంగా.

"ఎన్నాళ్ళిలా? నీకు నచ్చని గడ్డంతో నీకు దూరమై ఎలా గడపగలను?" అన్నాడు శశాంక ప్రేమగా.

"ఏమో బాబూ! చూడగా చూడగా నాకు మీ గడ్డం నచ్చింది. నాకు గడ్డం వున్న శశాంకే కావాలి!" అంది పద్మజ మంచం పైని దిండూ, దుప్పటీ తీసుకుంటూ.

అమాంతం మంచంపై విరుచుకు పడిపోయాడు శశాంక.

## జీనియస్ తమన్నా!

నిన్న మొన్నటి 'హ్యాపీ డేస్' చిన్నది తమన్నా వయసులో చిన్నదే కానీ తెలివిలో పెద్దదే. చాలామంది సీనియర్ హీరోయిన్ల కంటే నాలుగడుగులు ముందే ఉంది. అసలు విషయం ఏమిటంటే, తమన్నా ఈమధ్య ఒక ల్యాప్‌టాప్ కొనుకోలు చేసింది. వెనువెంటనే ల్యాప్‌టాప్ ముందు కూర్చుని బ్రౌసింగ్ మొదలుపెట్టింది. ఎప్పటికప్పుడు సినిమా కబుర్లన్నీ అందరికంటే ముందుగా తనే తెలుసుకోవాలని కాబోలు. అంతేకాదు, వెబ్‌సైట్స్‌లో తనకు సంబంధించిన విశేషాలు చదివి, వివిధ యాంగిల్స్‌లో ఉన్న తన స్టిల్స్ చూసుకుని మురిసిపోవాలని కాబోలు! ఎంతైనా తమన్నా తెలివైనదే సుమా!